క్లుప్తంగా

ఓంశక్తి ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ



ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ సేవకులు

నగరి: వేసవిని పురస్కరించుకొని ఎండపట్టున వెళ్లే పాదచారుల దాహార్తి తీర్చడానికి ఓంశక్తి ఆలయ నిర్వాహకులు ఆలయ ప్రాంగణంలో గంజి ప్రసాదం పంపిణీ చేయడం ప్రారంభమై 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం ఆలయం వద్ద మజ్జిగ, గంజి, అంబలి పాదచారులకు అందించారు. వేసవి కాలం పూర్తయ్యేవరకు పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సహకారం అందించడానికి ముందుకు వచ్చే దాతలు వారే అంబలి, మజ్జిగ, గంజి ఆలయం వద్దకు తెచ్చి పాదచారులకు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఓంశక్తి ఆలయ సేవకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం



విశేషాలంకరణలో ఉత్సవ మూర్తులు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఘనంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ క్రమంలో మూలవర్లకు విశేష పూజలు జరిపించారు. ఉత్సవమూర్తులను వైభవంగా ఊరేగించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హంస వాహనంపై పార్వతీ పరమేశ్వర్లు



హంస వాహనంపై విహరిస్తున్న పార్వతీ పరమేశ్వర్లు

పుత్తూరు: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి అమ్మవార్లు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మురళీగురుకుల్ స్వామి అమ్మవార్లకు అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి హంస వాహనంపై కొలువు దీర్చారు. రాత్రి 8 గంటలకు మంగళ వాయిద్యాలు, విద్యుత్ దీపకాంతులతో హంస వాహనంపై పట్టణ పురవీధుల్లో పార్వతీ పరమేశ్వర్లు ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కోలా సాయికృష్ణ, కోలా తేజకృష్ణ ఉభయదారులుగా వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా గోపూజ



చిత్రపటంతో అర్చకులు, భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో శ్రీకృష్ణాలయంలో శనివారం శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. అనంతరం రాధారుక్మిణీ సమేత శ్రీకృష్ణుని చిత్రపటం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవగ్రహ హోమం, శాంతి హోమం జరిపించారు. ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు సన్మానం

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల జిల్లాలో నలుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి లభించిన విషయం తెలిసిందే. అందులో ముగ్గురిని డీపీఓ కార్యాలయంలో డీపీఓ సుధాకర్‌రావు సన్మానించారు. గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి, పురుషోత్తం, రాజశేఖర్‌బాబుకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓతో సమీక్ష నిర్వహించారు.

సంపూర్ణ ఉత్తీర్ణతకు సంసిద్ధత

- పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- ప్రత్యామ్నాయ సెలవులు తప్పకుండా ఇవ్వాలంటున్న ఉపాధ్యాయులు



గణితంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



నగరి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత నాలుగేళ్లతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల విడుదలైన ఫలితాలు వెనకబడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా చిత్తూరు జిల్లా 24వ స్థానంలో నిలిచింది. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ పాఠాలు బోధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించారు. నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షల్లో తప్పిన 795 మంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు

సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గత నెల 25వ తేదీ నుంచి ఉన్నత పాఠశాలల్లో రోజుకో సబ్జెక్టు చొప్పున ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లీషులో పరీక్ష తప్పిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. వీరికి ప్రత్యేకంగా తరగతులు ఏర్పాటు చేసి ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళిక ప్రకారం చదివిస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి.

వేసవి సెలవులు కోల్పోతున్న ఉపాధ్యాయులు

సప్లిమెంటరీ శిక్షణ పేరుతో విద్యాశాఖ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించడంతో వారు వేసవి సెలవులు కోల్పోతున్నారు. జీవో నెం–35 ప్రకారం ఉపాధ్యాయులకు వేసవిలో సెలవులు నిషేధిస్తే సంపాదిత సెలవులు, దసరా, సంక్రాంతి సెలవులు నిరోధిస్తే సీసీ సెలవులు ఇవ్వాలని అంటున్నారు. ఆ జీవోను ప్రభుత్వం పాటించడం లేదని ముందస్తు ప్రణాళిక లేకుండా వేసవిసెలవుల్లో తరగతులు నిర్వహించాలని చెప్పడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులను నిషేధించడాన్ని మానుకోవాలని పాఠశాల విద్యాశాఖకు ఉపాధ్యాయ సంఘం వారు ఎమ్మెల్సీల ద్వారా విన్నవించుకుంటున్నారు. వేసవి సెలవులను వినియోగించుకోని ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు

మండలం	విద్యార్థులు
నగరి	319
పుత్తూరు	269
నింద్ర	65
వడమాలపేట	94
విజయపురం	48
మొత్తం	795

ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలి



వేసవి సెలవులు వినియోగించుకోని ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలి. జీవో నెంబరు 35ను తప్పకుండా పాటించాలి. ప్రస్తుతం పనిచేస్తున్న అదనపు కాలానికి తగిన సెలవులు తప్పకుండా ఇవ్వాలి. ఈ అంశంపై విద్యాకమిషన్‌కు నివేదించుకున్నాం.

–మునిరత్నం, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

వందశాతం ఫలితాలు సాధించేందుకే



విద్యార్థులంతా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించేలా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు రోజువారీగా తరగతులకు హాజరై పరీక్షలకు సంసిద్ధులవుతున్నారు. ఈ సారి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులకు బోధన కల్పిస్తున్నాం.

–శ్రీదేవి, ఎంఈవో, నగరి మండలం

ఘనంగా పత్రికా స్వేచ్ఛ దినోత్సవం



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జర్నలిస్టులు

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్‌లో ఏపీడబ్ల్యూజే నేతలు జయప్రకాష్, తిరుమల ఆధ్వర్యంలో ప్రపంచం ప్రతికా స్వేచ్ఛ దినోత్సవం నిర్వహించారు. జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరచడమే జర్నలిజమని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమార్గాలను చూపడమే పత్రికల ధర్మమని వెల్లడించారు. అనంతరం పలువురు నిరుపేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏపీడబ్ల్యూజే నేతలు వెంకటేష్, ఎంజీఆర్, జాయింట్ కార్యదర్శి రాజయ్య, కోశాధికారి నరేష్, సతీష్, మునికృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.

పత్రికాస్వేచ్ఛను కాపాడుకోవాలి

తవణంపల్లె: పాత్రికేయులు పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజల పక్షాన నిలవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏపీయూడబ్ల్యూజే సౌజన్యంతో శనివారం తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పాత్రికేయ మిత్రులకు పంచిపెట్టారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ పత్రికలు సమాజానికి కళ్లు, చెవులు వంటివని అన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి రోజా అభినందన



రవి కుమార్తె సిరిని అభినందిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట(విజయపురం): ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించిన విద్యార్థిని సిరిని మాజీ మంత్రి ఆర్కే రోజా అభినందించారు. తిరుమండ్యం ఎంపీటీసీ రవి కుమార్తెతో శనివారం మాజీ మంత్రి ఆర్కే రోజాను తన నివాసంలో కలిశారు. ఆమె సిరిని అభినందించి, మరింత ఉన్నత చదువు చదవడానికి అవసరమైన సాయం అందిస్తానని అన్నారు. నగరి పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది మునిరాజ్ వివాహ మహోత్సవంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికిసాయం



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణ పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.కృష్ణారెడ్డి కుమారుడు పి.మురళి(38) శనివారం ఆకస్మికంగా కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి మురళి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, పట్టణ పార్టీ కన్వీనర్ ఏకాంబరం, కౌన్సిలర్ గుణ తదితరులు పాల్గొన్నారు.


జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులతో కంపెనీ యాజమాన్యం

పుత్తూరు: పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఆ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ 30 ఎంఎన్‌సీ కంపెనీలు హాజరయ్యారు. మొత్తం 530 మంది పాల్గొనగా 212 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలను కల్పించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.వెంకట ప్రసాద్, ప్రిన్సిపల్ యం.మాణిక్యం, ఎంబీఏ ఎంసీఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిహరన్, సిబ్బంది పాల్గొన్నారు.

దందాకు డంప్



పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ ధర్మరాజస్వామి గుడి సమీపంలో టీడీపీ నేతలు ఇసుక డంప్ చేశారు. తమిళనాడుకు తరలించేందుకు సుమారు 40 లోడ్‌ల ఇసుకను నిల్వ చేశారు. స్థానికులు ఫిర్యాదు చేసినా.. రెవెన్యూ, పోలీస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. -పాలసముద్రం

యథేచ్ఛగా మట్టి దోపిడీ





కూటమి నేతలు యథేచ్ఛగా మట్టి దోపిడీ చేస్తున్నారు. గారంపల్లె, కోట్రకోన వద్ద నీవా నదిలోని తువ్వ మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేసి అమ్మేసుకుంటున్నారు. నిత్యం దాదాపు 200 ట్రాక్టర్ల వరకు గ్రావెల్‌ను ఇటుక బట్టీలకు.. వెంచర్లకు తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకున్నారు. అయితే పచ్చ మూక మాత్రం భారీ యంత్రాలతో మట్టిని తవ్వేసుకుంటూ.. రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని ఆయా ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

– గంగాధర నెల్లూరు

అంబులెన్స్ నిర్వాహకుల దందా!

- భారీగా డబ్బులు వసూలు
- అంబులెన్స్‌లో కనిపించని అత్యవసర సౌకర్యాలు



పలమనేరు: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల దందా పెచ్చుమీరుతోంది. వీరంతా సిండికేట్‌గా మారి అత్యవసర రోగుల ప్రాణాలతో వ్యాపారాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా నెల్లిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుకు గురై కుటుంబీకులు ఇక్కడి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అతన్ని పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అయితే ఇక్కడి ఆస్పత్రి అంబులైన్స్, 108 వాహనాలు తిరుపతి దాకా వెళ్లవు. ఎమర్జెన్సీ సేవలకు కేవలం జిల్లా ఆస్పత్రి దాకా ఈ వాహనాలకు అనుమతులున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని పట్టణంలోని కొందరు ఆస్పత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి పలమనేరు నుంచి తిరుపతికి 110 కిలోమీటర్లకు భారీ మొత్తంలో బాడుగగా నిర్ణయించారు. కానీ ఆక్సిజన్ సౌకర్యం లేని అంబులెన్స్‌లు భారీగా డబ్బులు వసూలు చేయడంపై అత్యవసర రోగుల కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి వద్ద ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు తప్ప ఇతర వాహనాలు ఆస్పత్రి వద్దకు రాకుండా వీరంతా ప్లాన్ చేశారు. ఎవరికి అవసరమైనా అక్కడున్న ప్రైవేటు అంబులెన్స్‌లలో వారు చెప్పినంత ఇచ్చి వెళ్లాల్సిందే. అయితే ఆస్పత్రిలోని కొందరు డాక్టర్ల సహకారంతోనే ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు ఇష్టానుసారంగా బాడుగలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న రోగులతో ఆడుకోవడంపై పట్టణంలో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సీహెచ్‌సీలకు మంగళం..!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీల ద్వారా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు
- మండలానికి 17 రైతు సంఘాలకు పంపిణీ చేసిన గత ప్రభుత్వం
- విస్తృతంగా ప్రయోజనం పొందిన రైతులు
- కూటమి ప్రభుత్వంలో వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలు
- పార్టీ నేతలు, సానుభూతి పరులకే దక్కిన వైనం!



గత ప్రభుత్వంలో సీహెచ్‌సీ సంఘానికి ట్రాక్టర్ అందజేసిన వ్యవసాయ అధికారులు (ఫైల్)

గుడిపాల: ప్రజలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటు, సంక్షేమం అందిస్తూ వారిని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, వ్యవస్థలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ అందించేందుకు నెలకొల్పిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలదీ అదే పరిస్థితి. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో కియోస్క్ సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం.. వాటి పరిధిలోని కస్టమ్ హైరింగ్ సెంటర్ల(సీహెచ్‌సీ)కు సైతం చరమగీతం పాడింది. రైతులకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పరికరాలను ఇచ్చేందుకు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు చేసింది. గ్రామాల్లో రైతుసంఘాలు ఏర్పాటు చేసి వాటిని కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)గా పేరుపెట్టారు. ప్రతి సంఘానికి రూ.12 లక్షల నుంచి రూ.15లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో 26 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటికి 40శాతం రాయితీ, 60శాతం బ్యాంకు రుణంతో ట్రాక్టర్లు, రొటో వేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, దుక్కుసెట్లు తదితర వ్యవసాయ పరికరాలు అందజేసింది. వీటిని సంఘంలోని రైతులు వినియోగించుకోవడంతో పాటు గ్రామాల్లోని ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన వచ్చేవారు. దీనివల్ల రైతులందరికీ ప్రయోజనం కలిగేది. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు సంఘాలుగా కాకుండా వ్యక్తిగతంగా కొందరికి పరికరాలు పంపిణీ చేసి మమ అనిపించింది. కూటమి సానుభూతిపరులకే ఇవి దక్కాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా సీహెచ్‌సీలకు యంత్ర పరికరాలు అందజేసి ఉంటే అందరికీ ప్రయోజనం కలిగేదని రైతులు నిట్టూరుస్తున్నారు.



రొటోవేటర్లను అందిస్తున్న అధికారులు(ఫైల్)

గత ప్రభుత్వ విధానంతోనే మేలు

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా ట్రాక్టర్‌తో పాటు వివిధ యంత్ర పరికరాలు ఇచ్చారు. సంఘంలో ఉన్న రైతులతో పాటు మిగతా రైతులు కూడా అద్దె చెల్లించి వాటిని వాడుకొనే వాళ్లం తక్కువ అద్దెకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉండటం వల్ల పెట్టుబడి ఖర్చు కొంతవరు తగ్గేది. ఇప్పుడు కొంతమందికే యంత్ర పరికరాలు ఇవ్వడం వల్ల వారికి తప్ప మిగతా రైతులకు ప్రయోజనం ఉండదు.

–రాజా, రైతు,కొత్తపల్లె, గుడిపాల

రైతులందరికీ మేలు చేయాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకునే వారు. కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా రైతులందరికీ మంచి చేయాలి. ప్రధానంగా యంత్ర పరికరాలను వ్యక్తిగతంగా వినియోగించుకునేలా కొంతమంది రైతులకే ఇవ్వడం సరికాదు. గతంలో మాదిరిగా సంఘాలను ఏర్పాటుచేసి ఇస్తే రైతులంతా వినియోగించుకుంటారు.

– సూరి, రైతు, బొమ్మసముద్రం, గుడిపాల